## క్లుప్తంగా

### శ్రీకాళికాంబాదేవికి ప్రత్యేక పూజలు



శ్రీ కాళికాంబాదేవి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబాచంద్రశేఖర స్వామి దేవస్థానంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణలు చేశారు. చివరగా నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం కాళీమాత సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, దేవస్థానం చైర్మన్ ఆరవేటి వాసు, విజయ్‌కుమార్, నరసింహ, అంబరేష్, అర్చకులు సుబ్బాచారి, రాఘవేంద్రాచారి, సుబ్రమణ్యం శాస్త్రీ తదితరులు పాల్గొన్నారు.

### పనుల్లో నాణ్యత లేకపోతే చర్యలు



పనులను పరిశీలిస్తున్న ఈఈ నాగరాజు

నంద్యాల(అర్బన్): మోడల్ స్కూల్ భవన నిర్మాణ పనుల్లో నాణ్యత లేకపోతే చర్యలు తప్పవని ఏపీఈడబ్ల్యూఐడీసీ ఈఈ నాగరాజు హెచ్చరించారు. నంద్యాల మండలం మిట్నాల గ్రామంలో ఏర్పాటవుతున్న మోడల్ స్కూల్ భవన నిర్మాణ పనులను శుక్రవారం ఆయన ఏఈలు మునీశ్వర్, మధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో ఎక్కడా రాజీపడవద్దని, సకాలంలో పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ చంద్రమోహన్‌రెడ్డి, సభ్యులు సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

### నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నంది రైతు సమాఖ్య ప్రతినిధులు

నంద్యాల(వ్యవసాయం): రైతాంగ సమస్యలు పరిష్కరించాలని నంది రైతు సమాఖ్య ప్రతినిధులు నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారిని కోరారు. శుక్రవారం సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఎంవీ కృష్ణారెడ్డి, సలహాదారు ఓబులపతి, మధుసూదనరెడ్డి కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సీజన్‌కు ముందే రైతులకు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలని, ముఖ్యంగా పత్తిలో కల్తీ లేని హైబ్రీడ్ విత్తనాలు సరఫరా చేయాలన్నారు. ఎరువులు, క్రిమిసంహారక మందులు సైతం సకాలంలో అందజేయాలని కోరారు.

### పాఠ్య పుస్తకాలు పంపిణీకి సిద్ధం



రుద్రవరంలో పుస్తకాలు పరిశీలిస్తున్న ఎంఈఓ

రుద్రవరం: మండలంలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసేందుకు సిద్ధం చేసినట్లు ఎంఈఓ శ్రీలక్ష్మి అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలోని ఓ గదిలో నిల్వ చేసిన పుస్తకాలను శుక్రవారం ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొత్తం పాఠశాలలు 56 ఉన్నాయని వాటిలో బాలికలు 2,406, బాలురు 2,169 మంది కలిపి మొత్తం 4,575మంది ఉన్నారని అన్నారు. వీరికి అవసరమైన పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగ్‌లు, యూనిఫాం వంటివన్నీ మండల కేంద్రానికి చేరాయన్నారు. జూన్ 12లో వాటిని పాఠశాలలకు పంపించి విద్యార్థులకు పంపిణీ చేస్తామన్నారు.

### పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

చాగలమర్రి: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని టీఆఆర్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఇండ్ల జయరాజ్ డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం స్థానిక ఆ సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆందోళన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అధికార తెలుగు దేశం పార్టీ కడపలో ఏర్పాటు చేసిన మహానాడులో విద్యారంగం, నిరుద్యోగ సమస్యలపై చర్చించకపోవడం అన్యాయమన్నారు.

# ఆరోగ్యానికి ‘పొగ’ పెడుతోంది!

- పొగాకు ఉత్పత్తుల వాడకంతో ప్రాణాంతక వ్యాధులు
- ప్రధాన అవయావాలపై తీవ్ర ప్రభావం
- బాధితుల్లో యువతే ఎక్కువ
- నేడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం

**గతంలో 60 ఏళ్లు దాటిన వారిలో** మాత్రమే గుండెపోటు, బ్రెయిన్‌స్ట్రోక్, క్యాన్సర్ వంటి బాధితులను చూసేవాళ్లం. కానీ ఇప్పుడు దురలవాట్ల పుణ్యమా అని యువతకు కూడా ఈ వ్యాధులు అంటుకుంటున్నాయి. ఇందుకు ప్రధాన కారణం పొగాకు ఉత్పత్తులు వాడటమే. సరదాగానో, అభిమాన హీరోను చూసో స్మోకింగ్‌ను అలవాటు చేసుకున్న కొందరు క్రమంగా బానిసగా మారి విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. నేడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా పొగాకు వాడకం వల్ల కలిగే అనర్థాలు..దాని నుంచి బయటపడే మార్గాలపై కథనం.



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్లు



గోస్పాడు: పొగాకు అన్ని రకాలుగా ప్రమాదకరమే. పొగాకు ఉత్పతులన్నీ నోరు, గొంతు, అన్నవాహిక, కడుపు, ఊపిరితిత్తులు, మూత్రవ్యవస్థలపై ప్రభావం చూపుతాయి. పొగాకులో పాలిసైక్లిన్ ఆటోమేటిక్ హైడ్రో కార్బైడ్స్, నైట్రోజిన్ అమైన్స్, ఆటోమేటిక్ అమైన్స్ వంటి క్యాన్సర్ కారకాలు, కాడ్మియం, క్రోమియం, ఇథిలిన్ ఆక్సైడ్, ఆర్సానిక్ వంటి దాదాపు 72 రకాల క్యాన్సర్ కారకాలైన రసాయనాలు ఉంటాయి. ధూమపానం వల్ల ఈ క్యాన్సర్ కారకాలు ఊపిరితిత్తుల ద్వారా రక్తంలో ప్రవేశించి శరీరమంతా వ్యాపిస్తాయి. పొగాకు వాడితే కొన్ని నిమిషాల పాటు హుషారుగా ఉంటుందేమో గానీ ఆ తర్వాత అది శరీరంలోకి వెళ్లి ఒక్కో అవయవాన్ని దెబ్బతీస్తూ ప్రాణాంతక వ్యాధులకు కారణమవుతుంది. ఇలాంటి జబ్బులతో జిల్లాలోని ప్రభుత్వాసుపత్రులతో పాటు నంద్యాల పట్టణంలోని ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులు చుట్టు తిరుగుతున్న వారిలో యువకులే అధికంగా ఉన్నారు.

**పక్కనున్న వారిపైనా ప్రభావమే**

స్మోకింగ్ చేసేవారు తమ ప్రాణాల పట్లే కాదు, ఇతరుల ప్రాణాల విషయంలోనూ చాలా నిర్లక్ష్యంగా ఉంటున్నారు. తాము స్మోకింగ్ చేయడమే కాకుండా తమ పక్కన ఈ అలవాటు లేనివారికీ పాసివ్ స్మోకింగ్ ద్వారా విషాన్ని అందిస్తున్నారు. సిగరెట్ తాగడం ఒక్కటే కాదు.. పొగాకు సంబంధ పదార్థాలైన గుట్కా, ఖైనీ, జర్దా పాన్ వంటి తీసుకోవడం కూడా ఆరోగ్య సమస్యలను కొని తెచ్చేవే అని గుర్తుంచుకోవాలి. చాలా మంది వ్యాధులు మొదలయ్యే వరకు స్మోకింగ్ చేస్తూ ఆ తర్వాత ఈ అలవాటును ఎలా వదిలేయాలో తెలియక తికమక పడుతుంటారు.

**నంద్యా జిల్లా ఆసుపత్రిలో డీ అడిక్షన్ సెంటర్**

నేషనల్ టొబాకో కంట్రోల్ ప్రోగ్రామ్‌లో భాగంగా రెండేళ్ల క్రితం నంద్యాల జిల్లా ప్రభుత్వాసుపత్రిలో టొబాకో సజెషన్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఇందులో ఒక సైకాలజిస్టు, ఇద్దరు సోషల్ వర్కర్లు విధులు నిర్వహిస్తున్నారు. పొగాకు ఉత్పత్తులకు బానిసలైన వారికి ఇక్కడ కౌన్సిలింగ్, బిహేవియర్ థెరపీ చేస్తూ మూడు నెలల పాటు అలవాట్లు మాన్పించేందుకు గాను నికోటిన్ ప్యాచెస్ అందజేస్తున్నారు. ప్రతి రోజు 15 నుంచి 20 మందికి ఇక్కడ చికిత్స, కౌన్సిలింగ్ అందజేస్తున్నారు. ఇక్కడ అందించే నికోటిన్ ప్యాచెస్ అతికించడం వల్ల పొగతాగాలి, పొగాకు నమలాలి అనే ఆలోచనను తగ్గిస్తుంది. వీటి వల్ల అనారోగ్య సమస్యల నుంచి బయటకు రావడానికి ఉపయోగపడతాయి.

**మానితే ఇవీ ప్రయోజనాలు**

- గుండెజబ్బులు, క్యాన్సర్, రక్తపోటు దూరం
- రక్తప్రసరణ సక్రమంగా జరుగుతుంది
- రుచి, వాసన, గ్రహణశక్తి మెరుగుపడుతుంది
- త్వరగా అలసటకు గురికాకుండా ఉంటారు. ఆయుష్షు పెరుగుతుంది

**పొగాకుకు ఇలా దూరం కావాలి**

- పొగాకును ఒకేసారి మానకుండా రోజురోజుకు వాడకం తగ్గించుకుంటూ రావాలి.
- పొగాకు మానడానికి కాగితంపై తేది నిర్ణయించుకుని దానిని ఒకచోట అతికించాలి. కుటుంబ సభ్యులకు ఆ తేదిని చెప్పి వారిని గుర్తు చేయాలని చెప్పాలి.
- నికోటిన్ మాత్రలు, ప్యాచెస్ వాడితే పొగాకు మానాలన్న ఆలోచన వస్తుంది
- పొగాకు ఉత్పత్తుల నిషేధం విషయంలో ప్రజలు, స్వచ్ఛంద సంస్థలతో పాటు ప్రభుత్వమూ కఠినంగా నిర్ణయం తీసుకోవాలి.

**పొగాకుకు దూరంగా ఉండటం మేలు**



పొగాకు ఉత్పత్తులు వాడటం ద్వారా ప్రాణాంతక వ్యాధులు వస్తున్నాయి. ఇటీవల ముఖ్యంగా ఊపిరితిత్తులు, గుండెజబ్బులు, నోటి క్యాన్సర్ కేసులు బాగా పెరిగిపోయాయి. ధూమపానం వల్ల ప్యాసివ్ స్మోకర్లు(పక్కన ఉండేవారు) కూడా పెరుగుతున్నారు. దీనివల్ల పొగాకు తాగకపోయినా పక్కనున్న వారి ఊపిరితిత్తులు దెబ్బతింటున్నాయి. ఈ కారణంగా పొగాకుకు ప్రతిఒక్కరూ దూరంగా ఉండటం మేలు.

– డాక్టర్ అమూల్య, పల్మనాలజిస్టు ఇన్‌చార్జ్ హెచ్‌ఓడీ, నంద్యాల జిల్లా ఆసుపత్రి

## ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి



ఇళ్ల నిర్మాణాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గోస్పాడు: ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని హౌసింగ్ ఇన్‌చార్జ్ పీడీ శ్రీహరిగోపాల్ తెలిపారు. మండలంలోని యాళ్లూరు, శ్రీనివాసపురం, గోస్పాడు గ్రామాల్లో శుక్రవారం ఇన్‌చార్జ్ ఏఈ నాగశేఖర్ ఆధ్వర్యంలో గృహ నిర్మాణ పనులను పరిశీలించారు. జిల్లాలో 2020 నుంచి 61,784 ఇళ్ల నిర్మాణాలు మంజూరు కాగా 32,360 ఇళ్ల నిర్మాణాలు పూర్తయినట్లు తెలిపారు. అయితే, వచ్చే నెలకు 9,432 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసే లక్ష్యం ఉందన్నారు. అయితే, ఎస్సీ, బీసీలకు ప్రభుత్వం కొత్తగా రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, చెంచులకు రూ.లక్ష అదనంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టే వారికి మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఆయా ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసుకోవాలని తెలిపారు. జిల్లాలోని ఆరు మున్సిపాలిటీల పరిధిలో మాత్రమే కొత్తగా ఇళ్ల నిర్మాణాల కోసం ప్రతిపాదన చేసినట్లు తెలిపారు. స్థలాలు ఉండి ఇళ్ల నిర్మాణాల కోసం దరఖాస్తు చేసుకున్న 2,495 మందికి ఇళ్ల నిర్మాణాల మంజూరు కోరుతూ ప్రతిపాదన చేసినట్లు తెలిపారు. ఆయన వెంట హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## కోలుకోలేక వ్యక్తి మృతి

బండిఆత్మకూరు: బండిఆత్మకూరు మండల పరిధిలోని నారాయణాపురం గ్రామానికి చెందిన తలారి శ్రీనివాసులు(56) చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. శ్రీనివాసులు కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతూ పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నాడు. జబ్బు నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఈనెల 24న చెట్టుకు ఉరివేసుకున్నాడు. అటువైపు వెళ్తున్న వారు గమనించి వెంటనే ఉరి నుంచి తప్పించి నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జగన్ మోహన్ తెలిపారు. మృతుడికి భార్య కిట్టమ్మ, ఇద్దరు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

## చట్టాలపై అవగాహన అవసరం



నర్సిపల్లెలో ఎస్సీ కాలనీ వాసులతో సమావేశం ఏర్పాటు చేసిన అధికారులు

ఉయ్యాలవాడ : పౌర హక్కుల చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు సూచించారు. శుక్రవారం మండలంలోని నర్సిపల్లె గ్రామం ఎస్సీ కాలనీలో చట్టాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఏదైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకు రావాలని కోరారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంటు నుంచి వచ్చే వృథా నీరంతా తమ పంట పొలాల్లోకి వస్తున్నాయని ఎస్సీ రైతులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఉపాధిలో వంద రోజుల పని దినాలు కల్పించాల్సి ఉండగా పనులు చూపడం లేదంటూ గ్రామానికి చెందిన మర్రి ఓబులేస్, రమణయ్యలతో పాటు మరి కొందరు వాపోయారు. అలాగే ఏప్రిల్, మే నెలలకు సంబంధించి ఉపాధిలో పనులకు వెళ్లినా ఇంత వరకు వేతనాలు రాలేదన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే కూలీల వ్యక్తిగత ఖాతాల్లో జమ చేస్తామని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వరరావు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

## పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు పోరాటం



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు పోరాటాలు చేస్తామని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఆపార్టీ కార్యాలయంలో జూన్ 2వ తేదీన పేదల ఇళ్ల స్థలాలకై తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలు ఇచ్చిన అర్జీలను సత్వరమే పరిశీలించి ఇళ్ల స్థలాలు కేటాయించాలన్నారు. రూ.5లక్షలు ఇళ్లు నిర్మించుకునేందుకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీలో భాగంగా ప్రతి పేదవాడికి పట్టణ ప్రాంతంలో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్ల స్థలం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్, కార్యవర్గ సభ్యులు సుంకయ్య, రాముడు, ప్రసాద్, సంజీవ్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మీదేవి, సోమన్న, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



ఆళ్లగడ్డలో కురుస్తున్న వర్షం



ఉయ్యాలవాడలో..

## ఆళ్లగడ్డలో భారీ వర్షం

ఆళ్లగడ్డ/ఉయ్యాలవాడ/దొర్నిపాడు: నైరుతి రుతుపవనాల కారణంగా ఆళ్లగడ్డ నియోజకవర్గంలో మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. నియోజకవర్గ వ్యాప్తంగా రహదారులు అన్నీ జలమయమయ్యాయి. దీంతో వాహనాదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరోవైపు పంట పొలాలు బీళ్లుగా మారుతున్నాయని రైతులు కలవర చెందుతున్నారు. ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లో ఎడతెరిపి లేకుండా కురుసున్న వానకు వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి.

- **ఉయ్యాలవాడ :** ఉయ్యాలవాడ మండలంలో మే నెల సాధారణ వర్షపాతం 36.4 ఎంఎం కాగా ఇప్పటికే 147.2 ఎంఎం వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు.

## ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠ



పూజలందుకుంటున్న ఎల్లమ్మ దేవత



పోతురాజుకు పూజలు చేస్తున్న భక్తులు

శిరివెళ్ల: యర్రగుంట్లలో పునర్‌నిర్మించిన ఎల్లమ్మ గుడిలో శుక్రవారం విగ్రహాల ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. రామమడుగు వసంత శర్మ బృందం మహాలక్ష్మీ స్వరూపిణి, గ్రామ దేవత శ్రీ ఎల్లమ్మ దేవత, పోతురాజు, శ్రీ మహాకాళి, శ్రీ మహా సరస్వతి, వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రమణ్యేశ్వరస్వామి వార్ల విగ్రహాల ప్రతిష్ఠ భక్తి శ్రద్ధలతో నిర్వహించింది. ముందుగా యంత్ర, కలశ ప్రతిష్ఠ, బలిహారం, పూర్ణాహుతి కార్యక్రమాలు చేపట్టారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు తరలి వచ్చి దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## వైభవంగా మహాకుంభాభిషేక వేడుకలు



యాగశాలలో మహా పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహిస్తున్న వేదపండితులు



శ్రీ చంద్రమౌళేశ్వర స్పటిక లింగ అభిషేకాన్ని తిలకిస్తున్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని సంజీవనగర్‌లో శ్రీ కోదండ రామాలయంలో మహాకుంభాభిషేక వేడుకల్లో వైభవంగా జరిగాయి. చివరి రోజు శుక్రవారం శ్రీ జగద్గురు శ్రీవిద్యా శంకర భారతి మహాస్వామి చేతుల మీదుగా వేద పండితులు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం స్పటికలింగ శ్రీచంద్రమౌళిస్వార స్వామికి మహాన్యాసాపూర్వక ఏకరుద్రా అభిషేకాలు నిర్వహించారు. ధ్వజ స్తంభ పునః ప్రతిష్ఠ, శ్రీ సిద్ధిబుద్ధి సమేత శ్రీ మహాగణపతి చల ప్రతిష్ఠను శాస్త్రోక్తంగా చేపట్టారు. అనంతరం దేశంలోని వివిధ నదుల నుంచి తీసుకొచ్చిన పవిత్ర గంగాజలంతో నింపిన సహస్ర కలశాలతో మహాకుంభాభిషేక వేడుకలు నిర్వహించారు. ఆలయంలోని సకలదేవతా మూర్తులకు పుష్పలంకరణం గావించి వస్త్రాలు సమర్పించారు. హోమాలు నిర్వహించి మహాపూర్ణాహుతి కార్యక్రమం చేపట్టారు. భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని శ్రీ భగవత్ సేవ సమాజ్ సభ్యులు ఏర్పాటు చేశారు. భగవత్ సేవా సమాజ్ సభ్యులు సముద్రాల సూరయ్య, శ్రీనివాస్, వసంత్, మధుసూదనగుప్తా, కృష్ణ పాల్గొన్నారు.

## తీరని సమస్య



కాలువలో పూడిక తీయక పోవడంతో ఇంటి ఆవరణలో నిలిచిన వర్షపునీటిని చూపుతున్న మహిళ

దొర్నిపాడు: మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన మండ్ల సరళ ఇంటిలోకి వర్షం నీరు చేరింది. మురుగుకాలువల్లో పూడిక తొలగించకపోవడమే దీనికి కారణమని ఆమె వాపోతూ మే 12న పీజీఆర్‌ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా వారంలోగా సమస్యను పరిష్కరించాలని మండల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అయితే, ఇప్పటి వరకు అతీగతీలేదు. 18 రోజులు గడిచినా తన సమస్య పరిష్కారం కాలేదని బాధితురాలు వాపోతున్నారు.

## ఖాళీపోస్టులను బదిలీల్లో చూపాలి

నంద్యాల(న్యూటౌన్): ప్రత్యేక విద్యా, ఉపాధ్యాయ సహాయకుల పోస్టుల ఖాళీలన్నింటినీ బదిలీల్లో చూపాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో వారు మాట్లాడుతూ ప్రతి మండలానికి ఇటీవల ఒక ప్రత్యేక ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయ పోస్టు మంజూరు చేశారు. అయితే బదిలీల్లో ప్రత్యేక ఉపాధ్యాయుల పోస్టులను 5 మాత్రమే చూపిస్తున్నారన్నారు. దీంతో బదిలీల్లో ఆ పోస్టు పొందాలనుకునే ఉపాధ్యాయులు నష్టపోతున్నారన్నారు. బండిఆత్మకూరు మండలం సంతజూటూరు గ్రామ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక విద్యా, ఉపాధ్యాయ సహాయ పోస్టును రద్దు చేశారన్నారు. అక్కడ ప్రస్తుతం 11 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారన్నారు.

**ఎస్టీ ఉపాధ్యాయులను చేర్చాలి..**

ఇటీవల ప్రకటించిన బయాలజికల్ సైన్స్, ఫిజికల్ సైన్స్, సోషల్ స్టడీస్ సహాయకుల పదోన్నతుల సీనియారిటీ లిస్టులో ఒక్క ఎస్టీ ఉపాధ్యాయుడు కూడా లేకపోవడం బాధాకరమన్నారు. జీవో నం.5 ప్రకారం పదోన్నతుల్లో ఎస్సీ,ఎస్టీలకు రిజర్వేషన్లు అమలు చేయాల్సి ఉందన్నారు. దీని ప్రకారం 6శాతం ఎస్టీ రిజర్వేషన్లు, అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## వీధి కుక్కల నుంచి ప్రజలను కాపాడండి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్

నంద్యాల(న్యూటౌన్): వీధి కుక్కల నుంచి పట్టణ ప్రజల ప్రాణాలు కాపాడాలని సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 31న జరిగే మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో వీధి కుక్కలు, దోమలు, పారిశుద్ధ్య సంబంధ అంశాలపై చర్చించాలన్నారు. ఇటీవ బేతంచెర్లలో ఓ పిల్లవాడిని వీధికుక్కలు కరిచి చంపని విషయం మరువకూడదన్నారు. ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు స్పందించి వీధి కుక్కల బెడదను కాపాడకపోతే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు శ్రీనివాసులు, మహిళా సంఘం పట్టణ కన్వీనర్ సుశీలమ్మ, రవి పాల్గొన్నారు.

## ఆలయ భూములకు తగ్గిన ఆదాయం

బండిఆత్మకూరు: మండల కేంద్రమైన బండిఆత్మకూరులో లక్ష్మీజనార్దన, ఆంజనేయస్వామి దేవస్థానం భూములకు పర్యవేక్షణ అధికారి గోపి ఆధ్వర్యంలో శుక్రవారం వేలం పాటలు నిర్వహించారు. పలువురు రైతులు పాల్గొని రూ.3.61 లక్షలకు 17.30 ఎకరాల భూములను దక్కించుకున్నారు. అయితే ఇదే భూములకు గత ఏడాది రూ.4.78 లక్షలు రాగా ఈ ఏడాది రూ.3.61 లక్షలు రావడంతో ఈ ఏడాది ఆలయ భూముల్లో రూ.1.17 లక్షలు ఆదాయం తగ్గింది.